# ఓ తల్లి కథ

జయంతి వెంకట రమణ

''బాబూ!'' అనే పిలుపుతో పోస్టాఫీసు మెట్లు దిగబోతున్న నేను ఆగి వెనుతిరిగాను.

మెట్ల ప్రక్క స్తంభానికి దగ్గరగా ఒక ముసలామె- ఆమే నన్ను పిలుస్తోంది. చిరిగి, మాసికలు పడ్డ చీరకొంగును భుజం మీదికి లాక్కుంటూ ఏదో నన్నే అడగబోతోంది. నాకు చిరాకేసింది.

రైలు స్టేషన్లు, బస్సుస్టాండులు, పోస్టాఫీసులు యాచకులకి, యాచనకి అనువైన స్థలాలు. ఒకరు కాకపోతే ఇంకొకరు, ఎవరో ఒకరు అయిదో, పది పైసలు విదల్చకపోతారా అని తిరుగుతూంటారు. పర్సు పోయిందనో, పిల్ల పెళ్ళి చెయ్యాలనో, మరేదో చెప్తూంటారు. నేను ఆమెను పట్టించుకోక ముందుకి పోబోయాను.

''బాబూ! ఒక్క సహాయం చేసి పెట్టవూ, నాయనా!'' అందామె.

ఆ పిలుపులో ఏదో ఆర్ద్రత వుంది. వెనుతిరుగుతూంటే ఆమే అంది- ''ఈ ఉత్తరం ముక్క రాసి పెట్టవు నాయనా! ఎంతా లేదు. నాలుగు ముక్కలే'' అని.

నాకు ఉత్తరం రాయటమంటే మహాబద్ధకం. అంతే కాదు, ఒకరు రాసిన ఉత్తరం చదవటమన్నా బద్ధకమే. ఒకవేళ ఎవరికైనా ఏమైనా రాయాల్సివచ్చినా రెండే రెండు మాటలు రాసి పడేస్తాను. అలాంటిది ఒకరికి ఉత్తరం రాసి పెట్టటమంటే నాకెంత చిరాకుగా వుంటుందో మీరే ఆలోచించండి. పచ్చ సిరాతో నా గజిటెడ్ హోదా తెలియజేసే సంతకం చెయ్యడమే పరమ విసుగు. ఒక్కొక్కప్పుడు ఇంపార్టెంటు ఫైల్సు మీద సంతకం పెట్టటం వాయిదావేసే నేను ఒకరికి ఉత్తరం రాసి పెట్టటమా?

''నాలుగే నాలుగు ముక్కలు నాయనా!'' అందామె దీనాతిదీనంగా. ఆమె ముఖంలో దీనత్వం చూచికాబోలు నేను లొంగిపోయాను.

''తొందరగా చెప్పండమ్మా! నేను ఆఫీసుకెళ్ళాలి'' అన్నాను.

''మా నాయనే! అలాగే బాబూ! ఇదిగో'' అంటూ తన మాసిన సంచీలోంచి ఒక పుస్తకం తీసి అందులోంచి ఒక ఇన్‌లాండు లెటర్ అందించింది.

కార్డుకి బదులుగా, ఇన్‌లాండ్ లెటర్ చూడగానే నాకు చిర్రెత్తుకొచ్చింది. నా చిరాకు కనిపెట్టింది కాబోలామె- ''ఎంతో పెద్ద ఉత్తరం కాదు నాయనా! మావాడు ఆఫీసరు. కార్డు మీద రాస్తే బాగోదు. అందుకనే ఇది'' అందామె. చల్లబడ్డాను.

నేను పెన్ను అందుకొని (పెన్ను ఆమే ఇచ్చింది. నాది పచ్చ ఇంకు పెన్ను కదా) బల్ల దగ్గరకు నడిచాను. ఆమె నన్ను అనుసరించింది.

''రాయి బాబూ!'' అంది.

''చెప్పమ్మా!'' అన్నాను.

ఆమె మొదలుపెట్టింది.

చిరంజీవికి,

ఆశీసులు!



నాయనా! నీ నుండి అయిదారు నెలలుగా ఉత్తరం లేదు. కారణం తెలియదు. నీవూ, పిల్లలూ, అమ్మాయీ కులాసా అని తలుస్తాను. నిన్ను చూడాలని వుంది. ఏం చేయను? మీ నాన్నగారు నాలుగు నెలలుగా మంచం మీద వున్నారు. కదలలేకపోతున్నారు. ఒక్కసారి నీవూ పిల్లలూ రండి. నాన్నగారు మిమ్మల్ని చూడాలంటున్నారు. ఇంకోమాట. ఈ నెల 18న నీ పుట్టిన రోజు. అశ్రద్ధ చేయక కొత్తబట్టలు కుట్టించుకో బాబూ. ఇంకా 15 రోజులు వుందికదా. మరచిపోకు. మునుపటిలా రాయలేకపోతున్నాను. చేతులు వణుకుతున్నాయి. నా చేతి రాత లేదని బాధపడకు. కోడలికి, పిల్లలకి ఆశీసులు. ఉత్తరం రాయి. వీలుచూచుకొని రండి.

— మీ అమ్మ

''అంతే నాయనా!'' అందామె. అంతేకాదు, ఇంకెంత చెప్పినా రాసిపెట్టే శక్తి నాకు ఆ ఉత్తరంలో సారాంశం ఇచ్చింది.

''ఇంకేమైనా వుంటే చెప్పండమ్మా! చాలా ఖాళీ వుంది'' అన్నాను.

''ఇంకేముంది నాయినా! ఇంకా రాసినా చదవడానికి వాడికి టైముండొద్దు నాయనా? బ్యాంకు పనులు ఎన్నో వుంటాయి కదా అబ్బాయికి'' అంటూ వణుకుతున్న చేతితో సంతకం పెట్టిందామె. ఆ మాటలు నన్నే వెక్కిరించాయి.

''అడ్రస్ ఇయ్యండమ్మా!'' అన్నాను.

''రాయి బాబూ! ఎం.రవిశంకర్ వర్మ, బ్రాంచి మేనేజర్, స్టేట్ బ్యాంకు...''

''ఎవరమ్మా రవిశంకర్ వర్మ అంటే... కొంపతీసి మా వర్మ కాదుకదా.''

''మీ వర్మ ఎవరు నాయినా!'' అందామె.

''అవునమ్మ! తెల్లగా పొడవుగా వుంటాడు, ఉంగరాల జుట్టువాడూనూ...ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే కుడిచేతి మణికట్టు మీద కుంకుడు గింజంత పుట్టుమచ్చ వుంటుంది.''

''అవును నాయనా! వాడే- వాడే మా రవి. నీకు తెలుసా బాబూ!'' అందామె ఆనందంతో.

''తెలియడమేమిటమ్మా! వాడూ, నేనూ గుంటూరులో టొబాకో కంపెనీలో కలిసి పని చేశాము. అప్పటికి మేము బ్రహ్మచారులం. ఆ తరువాత ఉద్యోగాలు వేరయి విడిపోయాము. అయినా మా స్నేహం చెడలేదు. అప్పుడప్పుడు కలుస్తునే వున్నాం. అంతెందుకు- ఈమధ్య హైదరాబాద్‌లో కలిశాడు కూడా'' అన్నాను.

''అలాగా నాయనా! చాలా సంతోషం. ఎలావున్నాడు బాబూ మా రవి? కులాసాగా వున్నాడా? అసలు హైద్రాబాద్ ఎందుకు వెళ్ళాడు? ఆఫీసు పనా?''

''కాదమ్మా! వాడుండేదే హైదారాబాద్!'' అన్నాను.

''కాదు నాయనా! మావాడు రాజమండ్రిలో పని చేస్తున్నాడు. నీవు ఎవరనుకుంటున్నావో!''

''నిజమేనమ్మా, నాలుగైదు నెలల క్రితం వరకు రాజమండ్రిలోనే వుండేవాడు. ఈమధ్యే హైదరాబాద్ వచ్చాడట. క్రిందటి నెలలోనేగా నేను వాడిని కలుస్తే!''

అన్నాను.

"నాకు తెలియదే! వాడు ఉత్తరమన్నా రాయలేదు. ప్రతీ నెలా నేను రాజమండ్రియే ఉత్తరం రాస్తున్నాను. అందుకే అందడంలేదు కాబోలు పిచ్చి తండ్రికి. అయినా వాడయినా నాకు రాయద్దూ! రాసినా ఈ పోస్టుమేన్ ఇవ్వడు నాయనా. దసరా మామూలు ఇవ్వలేకపోయాను. అందుకు కోపమేమో! అయినా పోస్టుమేన్ మంచివాడే బాబు. అతడెందుకు దాస్తాడు బాబు నా ఉత్తరం. ఏమొస్తుందని ?" ఆమె కళ్ళు చమర్చాయి. పైపళ్ళతో క్రింది పెదవి బిగబట్టింది. "ప్రతీ రోజూ ఈ ఉత్తరం కోసమే వస్తున్నా బాబూ" అంది.

"హైదరాబాద్ ఎడ్రస్ రాసేయనామ్మా!" అడిగాను.


రాసేయమన్నట్టు తలాడించిందామె.

నేను ఎడ్రస్ రాసి "ఇంకేమైనా రాయాలామ్మా!" అని అడిగాను.

"వద్దులే బాబూ! అతికించెయ్యి" అంది.

ఉత్తరాన్ని పోస్టుచేసే ముందు నా చేతిలో నుండి లెటరు అందుకొని, మళ్ళా నాచేతికిచ్చేసి- "నీవే పడేయి బాబూ!" అంది.

నాకేదో తోచింది. గబగబా ఒక కాగితం ముక్క మీద వర్మ ఇంటి చిరునామా, ఆఫీసు చిరునామా




రాసిచ్చి "ఉంచండమ్మా!" అన్నాను. కాగితాన్ని పరికించి అయిష్టంగా అందుకుందామె.

"ఎక్కడికెళ్ళాలమ్మా! చెప్పండి. మీ ఇంటి దగ్గర దింపివెళ్తాను" అన్నాను స్కూటర్ వేపు నడుస్తూ.

"వద్దు బాబూ! మా ఇల్లు చాల దూరం. నీవు రాలేవు. అయినా దారిలో నేను సంగీత పాఠాలు చెప్పుకొని వెళ్ళాలి. ఇవ్వాళ మా రవిని చూచినట్టున్నది నాయినా! వస్తాను బాబూ" అంటూ మెట్లు దిగి ముందుకు కదిలిపోసాగిందామె.

నేను ఆమెనే చూస్తూ నిల్చుండిపోయాను. అధునాతనమైన ఫర్నిచర్‌తో, చల్లని గాలిని నింపే ఎయిర్ కూలర్లున్న ఇంటిలో, అడుగడుగునా సంపదతో తొణికిసలాడే చిహ్నాలతో, రాజాలా భార్యాపిల్లలతో చిరునవ్వులతో జీవించే వర్మకి- చిరునవ్వుకి నోచుకోని, దయనీయ మైన జీవితాన్ని చిరుగుపాతలలో అనుభవిస్తున్న ఒక మాతృమూర్తి వుందని, కదలడానికి కూడ శక్తిలేని తండ్రి వున్నాడని నమ్మలేకపోయాను. అంత పెద్ద ఇంటిలో ఈ ముసలాళ్ళకి ఓ మూల జాగా మాత్రమేనా లేదా అని బాధపడ్డాను.

"ఈసారి వదినగార్ని, పిల్లల్ని తీసికొని రండన్నయ్యగారూ! ఓ వారం రోజుల పాటు వుండచ్చు." అని వర్మ భార్య అంటున్న మాటలు నా చెవిలో గింగురు మంటూనే వున్నాయి. ఆపాటి ఆహ్వానం ఆ ముసలి వాళ్ళకు లేదాని అనిపించిందా క్షణాన.

'నా తల్లీతండ్రీ బ్రతికి వుంటే బంగారంలా చూచుకోనూ!' అని అనుకుంటూ స్కూటర్ స్టార్టు చేశాను.

